కల్పతరువు

కామితార్థంబులెల్లను కల్పతరువు
వలెను దయచేయు దేవుండు కలడొకండు
దుర్లభంబగు నరజన్మ దొరకు కతన
అతని చేరుటే పరమ లక్ష్యంబు మీకు.

బాలబాలికలారా! భావిభారతపౌరులారా! భరతమాత మీకోసమై నిరీక్షించుచున్నది. భరతమాత కలువరేకులవంటి కన్నుల ద్వారా కార్చుచున్న కన్నీటి ధారలు మీకు కనుపించుటలేదా! ఆమె విలాపం మీరు వినుటలేదా! బాలబాలికలారా! కన్నులు తెరచి ఆ విలాపమునకు కారణమేమిటో, కన్నీటి ధారలు కార్చుటకు కారణమేమిటో గుర్తించటానికి ప్రయత్నించండి. ఎందుకోసం, ఎవరికోసం ఈ కంటిధారలు కార్చుచున్నది? తన బిడ్డలైన భారతీయులు ఒకరితోనొకరు కలహించుట చూచి కన్నీటి ధారలు కార్చుచున్నది భరతమాత. ఒకరి ఉన్నతిని చూచి మరొకరు అసూయపడటంచేత విలపించుచున్నది భరతమాత. తన ముద్దు బిడ్డలైన భారతీయులు స్వార్థమునకు, అహంకారమునకు, సంకుచిత భావములకు స్థానమిచ్చి చెడిపోవుచున్న పరిస్థితిని చూచి కన్నీరు కార్చుచున్నది భరతమాత. దురదృష్టవశాత్తు కొందరు స్వార్థపరులు కులతత్త్వములగూర్చి కుస్తీలు పట్టుచున్నారు. మతవర్గాలచేత మారణాస్త్రములను ప్రయోగించుచున్నారు. స్వార్థము, సంకుచిత భావములు మిన్నంటుచున్నవి. శీలరాహిత్యము చిట్టికొమ్మను చేరుచున్నది. క్రమశిక్షణ కంటికే కనిపించటం లేదు. అనైక్యత అనే బంధములచేత భరతమాత హస్తములు బంధింపబడినవి. ఈవిషసర్పముల బారినుండి భరతమాతను తప్పించు మహావీరులు మీరే. కారణమును గుర్తించి వర్తించి భరతమాత కంటిధారలు తుడుచువారు మీరే. కాని, దేశముయొక్క ఉన్నతిని, సమాజక్షేమమును గుర్తించు వ్యక్తులు ఈనాడు కరవైపోవటంచేత మనకట్టి ప్రబోధలు ప్రచారముచేసి, మన భరతమాత తత్త్వాన్ని, హృదయాన్ని, సంతృప్తిపరచు ప్రయత్నమునకు కొంత విలంబనము జరుగుచున్నది. ఈనాడు ఆత్మవిశ్వాసము అడుగంటిపోయినది. తరతరములనుండి కరుడు గట్టిన దేశభక్తి, దేశవిశ్వాసము విద్యార్థుల హృదయమును చేరుటకు అతిదూరముగా వున్నవి. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములను ప్రబోధించి, బాలుర చిత్తములు ఉల్లాసవంతముగా, ఉపయోగవంతముగా తీర్చిదిద్దు విద్యారంగము ఈనాడు క్షీణించినది.

బాలబాలికలారా! ఇది నిద్రించుటకు సమయము కాదు. 'ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధత'. అజ్ఞాన, అహంకార, స్వార్థములనే నిద్రనుండి, అలక్ష్యమనే నిద్రనుండి విద్యార్థులు మేలుకొని భరతమాతయొక్క సుక్షేమాన్ని ఆశించుటకు కంకణం కట్టుకోవాలి. భరతమాత ముద్దుబిడ్డలు వేలకు, లక్షలకు, కోట్లకు వుండికూడను మాతృమనస్సును సంతృప్తిపరచే వ్యక్తులు కరవైపోవటం మహావిచారకరం. రాముడి కొమరులైన లవకుశులు, తల్లి శోకమును గుర్తించి అనేకవిధములుగా ప్రార్థిస్తూ వచ్చారు. 'తల్లీ! ఊరకే కన్నీరు నింప కారణమేమమ్మా! శ్రీరాముని మించిన వీరకుమారులము మేము. కోరితే బంగారుకొండ తేగలమమ్మా! చెప్పకున్న వదలము నీ పాదములు. తల్లి చింత తీర్చలేని తనయుల బ్రతుకేలనమ్మా!' అని ప్రశ్నించారు. కనుక, భూజాత పుత్రులు లవకుశులైన బాలురు తల్లి యానతి ప్రకారము, తల్లి శోకమును తీర్చే నిమిత్తమై ఇంతతహతహలాడిన చిత్రాన్ని మీ హృదయాలలో ప్రతిష్ఠించుకోవాలి. భూజాత పుత్రులే తల్లి చింతను తీర్చే నిమిత్తమై ఇన్నివిధములైన ప్రయత్నములు చేసినప్పుడు భూమాత పుత్రులైన బాలబాలికలు, తమ మాతృమూర్తి చింతలు తీర్చే నిమిత్తమై కించిత్తైనా ప్రయత్నము చేయకుండా వుండటం చాలా విచారకరం. భరతదేశమందు అణువణువూ పవిత్రమైనదే. మనకు ప్రాప్తించిన కాలము మహాపవిత్రమైనది. ధర్మమును ఆచరించుచూ, ప్రేమను ప్రసరించుచూ, శాంతముతో జీవించటమే ఈనాటి మానవత్వ ప్రధానమైన కర్తవ్యం.

ఐక్యతకు మించిన మహాబలమైన శక్తి ఇంకొకటి లేదు. ఈనాడు ఐక్యత అనేకవిధములుగా ఛిన్నాభిన్నమై కనిపించుచున్నది. వ్యష్టిగా సాధించలేని దివ్యకార్యములను సమిష్టిగా సాధించుటకు అవకాశమున్నది. కునుక, సమాజ సుక్షేమాన్ని గుర్తించి, వ్యష్టిగా కాక, సమిష్టి రూపమును నిరూపించి తద్వారా ఈ సమస్యలను తీర్చుటకు తగిన కంకణము కట్టుకోవాలి. అన్యోన్యత, ఐకమత్యము లేని జీవితము కేవలము వ్యర్థమైపోతుంది. ఈ ఐకమత్యమునకు, సమరసమునకు సరియైనట్టిది మానవుని దేహమే. మానవుని దేహము అనేక అంగములతో సృష్టింపబడుతూ వచ్చింది. ఏయే అంగములకు కేటాయించిన కార్యములను ఆయా అంగములు సక్రమైన మార్గములో చేయుచున్నవి. తమతమ కర్తవ్యాలను తాము నిర్వర్తించుటయేకాక, మిగిలిన అంగములనుకూడా సామరస్యముతో , ఐక్యముతో ఆచరించుచూ వస్తున్నవి. ఒకదానికొకటి అనుసరించుచూ రావటంచేతనే, ఈ జీవితమునందు ఈ దేహతత్త్వము అనేకవిధములైన ఆదర్శములను అందించుచూ వస్తున్నది. మనస్సు ఫలానా ప్రదేశానికి పోవాలి అని సంకల్పించిన తక్షణమే కాళ్ళు నడుస్తున్నవి. ఫలానా పని చేయాలి అని మనస్సులో సంకల్పించిన తక్షణమే చేతులు ఆ పనిలో ప్రవేశిస్తాయి. ఫలానా వ్యక్తిని చూడాలి అని మనస్సు సంకల్పించిన తక్షణమే కన్నులు ఆ వ్యక్తికోసం వెతుకులాడుతున్నవి. కనుక ఈవిధముగా అన్ని అంగములూ, అన్ని ఇంద్రియములూ మనస్సును అనుసరిస్తున్నవి.

ఇక మనస్సు ఏవిధమైన ఆచరణను అనుసరిస్తూ వస్తున్నదనే విషయాన్ని మనం విచారించాలి. ఈ దేహమందున్న ఏ

అంగమునకు ప్రమాదము జరిగినప్పటికీ మనస్సు చాలా విచారిస్తుంది. కాలికి దెబ్బ తగిలెనా కన్ను ఏడుస్తుంది. ఈవిధముగా దేహమునందున్న ఒక్కొక్క అంగముకూడను ఒక్కొక్కదాన్ని అనుసరిస్తూ, ఒక్కొక్కదాని సుక్షేమాన్ని ఆశిస్తూ తమతమ కర్తవ్యకర్మలను ఆచరిస్తూ వున్నవి. అట్లుకాకుండా కేవలము తమకు నియమించిన కార్యమే తమకు ప్రధానమని భావించి ఒక్కొక్క అంగము తన కార్యములను మాత్రమే సాధిస్తూపోవటం చేత కలుగు ప్రమాదమేమిటో మనము కొంత విచారించాలి.

మన హృదయము రక్తము సర్వాంగములకు సరఫరా చేస్తున్నది. ఈవిధముగా చేస్తున్న సమయమందు మిగిలిన అంగములు కొంత అసూయాభావముచేతగాని, ఇంకేవిధమైన క్రోధముచేతగాని, ఎదురు తిరిగి ఒక సమ్మెను ప్రారంభించటానికి కనుక ప్రయత్నంచేస్తే మిగిలిన దేహమంతా క్షీణించిటానికి అవకాశమున్నది. ఏవిధంగా ఇది సమ్మెను ప్రారంభస్తుంది? సర్వాంగములు ప్రోగుచేసిన ఆహారమును కేవలము మనకు అందించక, ఒక్క నోరుమాత్రమే భుజించుచున్నదే అను అసూయాభావము మిగిలిన అంగములలో ప్రవేశించినప్పుడు, మిగిలిన అంగములు తమతమపనులను తాము స్తంబింపచేసినప్పుడు దేహమే క్షీణించిపోతుంది. ఇదేవిధముగనే దేశమునకు అంగములైన మానవులు తమతమ కర్తవ్యాలను తాము నిర్వర్తించక ఒకరికొకరు ద్వేషించుచూ, ఒకరిమీద ఒకరు అసూయ చెందుతూ విప్లవానికి దారితీయటంచేత దేశపరిస్థితికూడా క్షిణించిపోవటానికి కారణమయింది. ఎవరి స్వార్థము వారు అభివృద్ధి పరచుకొనుటకు ప్రయత్నించకూడదు. స్వార్థమే మహా పిశాచము. తాను, తనవారు మాత్రమే సుక్షేమంగా వుండాలని, ఇతరుల పరిస్థితి ఏమైననూ ఫరవాలేదనే స్థితిలో మానవుడు జీవంచకూడదు. అన్యోన్యతను అభివృద్ధిపరచుకునే విధానాన్ని ఈనాడు మనం అవలింబించాలి. ఈ అన్యోన్యత ఈనాడు క్షీణించిపోవటంచేతనే భారతదేశముయొక్క భవిష్యత్తు ఏవిధమైన దుస్థితిపాలౌతుందో అనే భయభ్రాంతులు ప్రతిమానవునియందును చెలరేగుతున్నవి.

ఇట్టి స్థితియందు, నేటి బాలవికాస్ విద్యార్థులు, విద్యార్థినులు ఈసత్యాన్ని గుర్తించి భవిష్యత్తుకు తగినంత భద్రతను ఏర్పరచుకొనే నిమిత్తమై మొట్టమొదట తమ విశ్వాసాన్ని బలపర్చుకోవాలి. ఆత్మవిశ్వాసాన్ని బలపరచుకునే నిమిత్తమై అనేకవిధములైన సాధనలను మనం సలుపవలసి వస్తుంది. అనేక విచారణలనుకూడా చేయవలసి వస్తుంది. ఈవిధమైన విచారణలను సల్పి ఆత్మవిశ్వాసమును బలపరచుకున్నప్పుడే ఆత్మత్యాగము (సెల్ఫ్‌శాక్రిఫైస్) ఆత్మసందర్శమునకు అర్హులవుతాము. బాలబాలికలారా! మనస్తత్త్వమును సంస్కరింపజేసుకొనే విద్యలు మనకు ఈనాడు అత్యవసరం. ఈనాటి విద్యలన్నియూకూడా మాయావిద్యలు. ఈనాటి యంత్రములన్నియూకూడా పొట్టకూటి యంత్రములు. ఈనాటి విజ్ఞానము లౌకికవిజ్ఞానము. కనుక, నిత్యజీవితమును పోషించుకునే నిమిత్తమై కొన్ని లౌకికవిద్యలు అవసరమే. ఇవి కేవలము జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినవి. జీవనోపాధితోబాటు జీవితపరమావధి కూడా గుర్తించటం మన ప్రధాన లక్ష్యం. జీవనోపాధిని మనం ఆధారంచేసుకొన్నప్పుడు జీవిత పరమావధి అనే పరమ తత్త్వమును ఏనాడు మనం గుర్తించుతాం!

బాలబాలికలారా! జీవనోపాధి కేవలం ఒక నెగిటివ్ వంటిది. జీవితపరమావధి పోజిటివ్ వంటిది. జీవనోపాధి అనేది కెవలం ఒక బల్బు వంటిది. జీవితపరమావధి కరెంటు వంటిది. జీవనోపాధి అనే బల్బును మాత్రమే మనం ప్రధానంగా చూసుకుంటే కరెంటు లేక వెలుతురు మనం పొందలేము. కనుక, జీవనోపాధి అనే బల్బునకు జీవితపరమావధి అనే కరెంటును కూడా కొంత మనం సంపాయించుకోవాలి. ఈ రెండింటి ఐకమత్యముచేతనే మన జీవితము జీవనజ్యోతిగా రూపొందుతుంది. జీవితమందు జీవనజ్యోతి ఏనాడు మనం వెలిగించుకొందుమో ఆనాడే మానవత్వము సార్థకమౌతుంది. దైవవిశ్వాసాన్ని మనం గాఢంగా పెంచుకోవాలి. దైవవిశ్వాసమే కనుక లేకపోతే మనం దయ్యాలుగా రూపొందుతాం. ఇంక మానవత్వ సార్థకతకు కారణమేమిటి? 'జంతూనాం నరజన్మ దుర్లభం' అనేదానిలో వున్న అంతరార్థమేమిటి? అగోచరమై, అవ్యక్తమై ఉన్న శక్తిని ఏ మానవుడు వ్యక్తీకరింపజేస్తాడో అతనికే మానవత్వమనే పేరు సార్థకమౌతుంది. కనుక, ఆత్మవిశ్వాసాన్ని మనం పెంచుకోవాలి. విస్వాసమే లేకపోతే ఒక్క క్షణకాలమైనా మన శ్వాస నిలవదు. మార్కెట్‌కు వెళ్ళి కొంత సామాను తీసుకోదలచిన వ్యక్తి, మార్కెట్‌కు వెళ్ళి నేను ఇంటికి తిరిగి రాగలను అను విశ్వాసమే లేకపోతే ఆ వ్యక్తి మార్కెట్‌కు ప్రయాణం చేయలేడు. ఇల్లు కట్టుటకై ప్రయత్నముచేయు వ్యక్తి పునాదులు తీసి ఈ ఇల్లు నేను పూర్తిచేయగలను, అనే నమ్మకమే లేకపోతే, పునాదులను తాను ప్రారంభించడు. నేను స్కూలుకు వెళ్ళి ఇంటికి తిరిగి వస్తాను అనే విశ్వాసమే లేకపోతే తాను స్కూలుకే వెళ్ళడు. మనకు హోమ్‌వర్కు ఇచ్చినారంటే నేను రేపటి దినము దీనిని సరిగ్గాచేసుకొని టీచరుకు అప్పచెప్పగలననే విశ్వాసమే లేకపోతే తాను హోమ్‌వర్కునకే పూనుకోడు. ఇలాంటి చిన్నచిన్న నిత్యజీవితములో సంభవించే విషయములందు గాఢమైన విశ్వాసముంది మానవునికి. కుమారుడు పుట్టిన తక్షణమే వానిని విద్యావంతుడిని చేసి అమెరికా పంపాలని పదివేల రూపాయలు ముందుగానే బ్యాంకులో డిపోజిట్ కట్టుకుంటున్నాం. పది సంవత్సరముల వరకు ఆ కుమారుడు జీవించగలడను గ్యారంటీ ఏమి? కేవలము లౌకికమై, అనిత్యమై, అశాశ్వతమై, అసత్యమైన విషయములందు గాఢమైన విశ్వాసాన్ని మనం బలపరచుకుంటున్నాము. నిత్యసత్యమైనటువంటి దైవతత్త్వాన్ని ఈనాడు మనం విస్మరిస్తున్నాము. కనుక, మానవునికి ఆనందం లభించాలంటే, సంతోషం ప్రాప్తించాలంటే ఇలాంటి విశ్వాసము లేకపోతే తాను ఏరీతిగా ఆనందాన్ని పొందగలడు? మొట్టమొదట 'సెల్ఫ్‌కాన్ఫిడెన్స్' ఆత్మవిశ్వాసము. రెండవది 'స్ల్ఫ్ శాటిస్‌ఫాక్షన్'. ఇట్టి

ఆత్మవిశ్వాసాన్ని కలిగి వుండిన ఈ ఆనందమనేది మనకు లభిస్తుంది. ఆత్మవిశ్వాసము లేనివానికి ఆనందం ఎంతదూరంగా వుంటున్నది. అట్టి వారు ఆనందం నటించవచ్చుగాని నిజమైన ఆనందం అనుభవించలేరు. కనుక, ఈ సెల్ఫ్‌శాటిస్‌ఫాక్షన్ వుండినప్పుడే 'సెల్ఫ్‌శాక్రిఫైస్' చేస్తాము. తాను సంతోషముగా లేనప్పుడు ఏవిధమైన త్యాగమునకు పూనుకుంటాడు? కనుక, ఈ త్యాగమునకు 'శాటిస్‌ఫాక్షన్' తృప్తి అనేది అత్యవసరం. ఎప్పుడు ఈ 'శాక్రిఫైస్' చేస్తాడో 'సెల్ఫ్‌రియలైజేషన్' అనేది మనకు లభిస్తుంది.

కనుకనే, నాలుగు S లలోనున్న జీవిత రహస్యాన్ని మనం గుర్తించాలి.

First S-- Self Confidence,
Second S--Self Satisfaction,
Third S-- Self Sacrifice,
Fourth S-- Self Realisation.

Four Fs
!st F- follow the master,
2nd F- face the devil,
3rd F- fight to the end,
4th F- finish the game.

ఫస్ట్ ఎఫ్ ఫాలో ది మాష్టర్. మాష్టర్ అనగా ఎవరు? మన బాలవికాస్ గురువా లేక పాఠశాలలోనున్న గురువా? ఈ గురువులు మార్పుచెందేవారు. నీయొక్క హృదయమే, నీ కాన్షస్‌నెస్ నీ మాష్టర్. నీ కాన్షనెస్‌ను నీవు ఫాలోచేసినప్పుడే నీ జీవితము భద్రమైన స్థానాన్ని అందుకుంటుంది. కనుకనే ఫాలో ది మాష్టర్. నీ దుర్గుణములను, దుర్బుద్ధులను, దురాలోచనలను, దుర్భావములను కొంతవరకైనా దూరం చేయాల్సి వుంటుంది. ఇక మూడవది ఫైట్ టు ది ఎండ్. నాల్గవది ఫినిష్ ది గేమ్. ఈ నాలు ఎఫ్‌లుకూడా మీరు నిరంతరము హృదయములో పెట్టుకొని వుండాలి. ఈ నాలుగింటియొక్క రహస్యాన్ని మనం ఏనాడు గుర్తింతుమో అప్పుడే నాలుగు ఎఫ్‌లకు మన జీవితమును అంకితము చేస్తాము.

బాల్యమునందే ఈ పవిత్రమైన రహస్యాలు గుర్తించినందువల్ల ఎంతైనా మీరు భవిష్యత్తులో ఆదర్శవంతమైన జీవితాన్ని అందించటానికి అవకాశముంటుంది. కనుక, నేటి బాలబాలికలే భవిష్యత్తులో పౌరులుగా రూపొంది, ఈ పవిత్రమైన భారతదేశ విచారమును కొంతవరకు దూరంగావించి ఆ తల్లికి తగినటువంటి ఆనందాన్ని అందించే ముద్దుబిడ్డలుగా మీరు రూపొందుతారని నేను ఆశిస్తున్నాను. మొట్టమొదట మీ దేహమాతను సంతృప్తి పరచటానికి ప్రయత్నించండి. మీ దేహము, మీ ఆహారము, మీ వస్త్రము, మీ జీవితము అంతయూ మీ తల్లి ప్రసాదమే. కనుక, దేహమిచ్చిన మాతను సంతృప్తిపరచటానికి ఈ బాలబాలికలు మొట్టమొదట కంకణం కట్టుకోవాలి. ఆవిధమైన మార్గమందు ఉత్తీర్ణులైన వారే దేశమాతను సంతృప్తి పరచుటకు అర్హులౌతారు. దేహమాతనే సంతృప్తి పరచలేని అల్పుడు, బలహీనుడు దేశమాతనేవిధంగా సంతృప్తిపరచగలడు? కనుక, 'మాతృదేవోభవ', 'పితృదేవోభవ', 'ఆచార్యదేవోభవ', 'అతిథిదేవోభవ' అని వేదము, మొట్టమొదట తల్లిదండ్రులను గౌరవించి, గురువులను గౌరవించి, గురువులను గౌరవించి, ఇంటికి వచ్చిన అతిథులను గౌరవించి, చక్కని తీయని మాటలచేత, వినయముచేత, విధేయతచేత వారిని ప్రసన్నులను గావించుకునే విధానాన్ని ఈనాడు బాలబాలికలు చేపట్టాలి. ముఖ్యముగా విద్యార్థులు వినయవిధేయతలు పెంచుకోవాలి. అలక్ష్యముగాకానీ, అహంకారముతోగానీ ప్రవర్తించకూడదు. పిల్లలందరూ ఒకరినొకరు అన్నదమ్ములవలె, అక్కచెల్లెళ్లవలె ప్రేమించాలి. ఏ చిన్నవిషయానకిగానీ ఒకరితోనొకరు కలహించుకోకూడదు. మీ కలహము చిన్నదిగా రూపొంది, తదుపరి పెద్దదియై బ్రహ్మాండమునంతా ఆవరించుకుంటుంది. మఱ్ఱి విత్తనము చాలా చిన్నదిగా వుంటుంది. దాన్ని పెంచటంచేత బ్రహ్మాండమైన వృక్షంగా రూపొందుతుంది. కనుక, ప్రపథమంలో అణుస్వరూపమైన నీ ద్వేషమునుగానీ, అసూయనుగానీ అప్పటికప్పుడే అరికట్టటానికి ప్రయత్నించినప్పుడు ఇది బ్రహ్మాండమైన వృక్షంగా రూపొందుతుంది. కనుక, మన జీవితమును, Start the day with love, Spend the day with love, Fill the day with love, End the day with love. ఈ ప్రేమతత్త్వాన్ని మన హృదయములో నింపుకొనుటకు ప్రయత్నంచేయాలి. భావిభారతోద్ధారకులు మీరే.

సత్యసాయి బాలవికాస్ బాలబాలికలు భవిష్యత్తులో దేశమునకు ఆదర్శవంతమైన జీవితాలను అందిస్తారనే విశ్వాసము స్వామికి గాఢంగా వున్నది. ఈనాడు దేశములో చెలరేగుతున్న అన్యాయ, అక్రమ, అనాచార, అసత్య, అధర్మములనెడి పెనుభూతములను హతమార్చి శాంతి, సంతోష, సౌఖ్యములను అందించు అధికారులు బాలవికాస్ బాలబాలికలే! ఈ అధికారమును సాధించి, ఆనందముతో జీవితమున ముందంజవేస్తూ, భారతదేశమునుద్ధరించుటకు కంకణము కట్టుకొను మహావీరులు, పవిత్రులు, శూరులు, భక్తులు, త్యాగులు, యోగులు, మునులుకూడా మీరే అగుచున్నారు. అధ్యాపకులుకూడా ఈ ముక్కుపచ్చలారని బాలబాలికల భవిష్యత్తును తగిన మార్గములో నడిపే నిమిత్తమై, తగిన కృషిచేసి, తగిన ఉత్సాహప్రోత్సాహములను వారికందించి, శాంతమనస్కులై వారినుద్ధరించుటకు తగిన త్యాగమునకు పూనుకోవాలని నేను ఆశిస్తున్నాను.

(బాలవికాస్ బాలబాలికలకు భగవాన్ దివ్యసందేశము, 22-11-1979, ప్రశాంతినిలయము)